క్లుప్తంగా

నేటి నుంచి ఈదమ్మ జాతర

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఈదమ్మ తల్లి జాతర ఆదివారం నుంచి ప్రారంభమవుతుందని దేవాలయ నిర్వాహకుడు శేషయ్య తెలిపారు. ఆదివారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు జాతర వైభవంగా జరుగుతుందని చెప్పారు. ఉదయం సుప్రభాతంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటుగా ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో జాతరకు హాజరై పూజలు నిర్వహిస్తారని చెప్పారు. దేవాలయం వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ర్యాలీ



గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని చెన్నారంలో శనివారం ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాయానికి చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు దాని ప్రభావాలు, బాలికల విద్య, బాలకార్మికులు, మద్యపానం, రక్తహీనత గురించి వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓ రాధిక, సుప్తా, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రీపాదరావుకు నివాళి

పాన్‌గల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మాజీ స్పీకర్ శ్రీపాదరావు 90వ జయంతి సందర్భంగా ఎంపీడీఓ కోటేశ్వర్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఏపీఓ కుర్మయ్య, సీనియర్ అసిస్టెంట్ వరమ్మ, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని పెద్దమందడి మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ సద్గుణ, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ప్రభుత్వం దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

మొక్కల సంరక్షణపై దృష్టి సారించండి

అమరచింత: నర్సరీలో మొక్కలు వాడిపోకుండా నిత్యం నీటిని అందించి సంరక్షించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని కొంకన్వానిపల్లెలో శనివారం నర్సరీలో మొక్కలను పరిశీలించారు. రహదారికి ఇరువైపుల నాటిన మొక్కలకు నీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీ పరిధిలో నాటిన మొక్కల సంరక్షణ కోసం వాటర్ ట్యాంకర్‌లను వినియోగించుకోవాలన్నారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజు ఉదయం, సాయంత్రం మొక్కలకు నీటిని అందించాలని సూచించారు. ఎంపీఓ నరసింహులు, పలువురు ఉన్నారు.

పశువులకు టీకాలు

ఖిల్లాఘనపురం: రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి సుసాన్ కేసి తెలిపారు. శనివారం మండలంలోని ఆగారం, అంతాయపల్లిలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. గ్రామంలో నిర్వహించిన క్యాంపులో మొత్తం 209 పశువులకు టీకాలు వేశామన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఈ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లేకుంటే వ్యాధిసోకి పశువులు నడవడానికి కూడా వీలుకాకుండా ఉంటుందన్నారు.

విద్యాశాఖలో అవినీతిపై ఫిర్యాదు

వనపర్తిటౌన్: జిల్లా విద్యాశాఖలో అవినీతి అక్రమాలు పెరిగిపోతున్నాయని శనివారం తెలంగాణ గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ నాయకులు హైదరాబాద్‌లోని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. శరత్ మాట్లాడుతూ.. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నా, ఇన్‌చార్జి విద్యాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్‌కు విన్నవించుకున్న సమస్య పరిష్కారం కాలేదన్నారు.

ఘనంగా ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవం

పెబ్బేరు రూరల్: పట్టణంలో ఎంఐఎం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల అధ్యక్షుడు అప్రోజ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ మైనారిటీలకే కాకుండా బీసీ, ఎసీ, ఎస్టీల సమస్యలకై పోరాడుతుందని, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ నిరంతరం సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మజ్లీస్ పార్టీ కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తుందన్నారు. జకీర్, మస్తాన్, ఆమేర్, సమీర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



ఆత్మకూర్ చెరువుకట్టవద్ద శివమాలధారుల పాదయాత్ర



శ్రీరంగాపురం ఆలయంలో..



మదనాపురం మీదుగా శ్రీశైలం వెళ్తున్న భక్తులు

మల్లన్న సన్నిధికి పాదయాత్రగా మాలధారులు

ఆత్మకూర్: నియమ నిష్టలతో 40 రోజుల పాటు శివ దీక్ష చేసిన భక్తులు శనివారం చేపట్టిన ఇరుముడి మహోత్సవం సందర్భంగా శివ నామస్మరణతో పట్టణం పులకించిపోయింది. పట్టణంలోని బాలబ్రహ్మేశ్వరస్వామి, నీలకంఠేశ్వరస్వామి ఆలయాల వద్ద ప్రముఖ పూజారులు కరుణాకరయ్య, గిరిధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలకు హాజరైన భక్తులకు, శివమాలధారులకు చైర్‌పర్సన్ గాయత్రి, బంగారు ప్రకాష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెరువుకట్టపై చెర్ల పరమేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం 200 మంది శివదీక్షపరులు పాదయాత్రగా శ్రీశైలం మల్లన్న సన్నిధికి తరలివెల్లారు.

మదనాపురం: శివమాలధారులు శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తమ దీక్షను విరమించేందుకు ఇరుముడి కట్టుకుని శ్రీశైలం బయలుదేరారు. శనివారం మండల కేంద్రం మీదుగా శ్రీశైలం కాలినడకన చాలామంది భక్తులు వెళ్లారు. రాయచూర్, మక్తల్, నారాయణపేట, అమరచింత, నర్వ, చిన్నచింతకుంట, ఆత్మకూర్, మరికల్ తదితర ప్రాంతాల వారు పాద్రయాత్రగా వెళ్తున్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఆది బసవన్న ఆలయంలో శివమాలధారులు శనివారం ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



ఆత్మకూర్ నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఇరుముడి మహోత్సవం



బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో..

ధరణి దరఖాస్తుల పరిశీలన



ఖిల్లాఘనపురంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



పాన్‌గల్ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ధరణి దరఖాస్తులను పరిశీలించారు. పలురకాల సమస్యలతో పెండింగ్‌లో ఉన్న వాటిని పరిష్కరించే కార్యక్రమంలో భాగంగా పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ పాండునాయక్ తెలిపారు. మండలంలో మొత్తం 218 సర్వే నంబర్లపై దరఖాస్తులు వచ్చాయన్నారు. సర్వే నంబర్‌లో భూమి తక్కువగా ఉండటం, లింగ భేదం, కోర్టు కేసులు ఉండటం, నిషేధిత జాబితా నుంచి తీసివేయడం తదితర పలు సమస్యలపై దరఖాస్తులు వచ్చాయన్నారు. సుమారు 167 దరఖాస్తులు మండలంలో పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. 32 సర్వే నంబర్ల వరకు పూర్తి చేశామన్నారు. మా పరిధిలోని సమస్యలను పూర్తి చేసి ఆర్డీఓ, కలెక్టర్, కమిషనర్ ఇలా ఏ స్థాయిలో పరిష్కరించే దరఖాస్తులను అక్కడికి తహసీల్దార్ ట్యాగ్‌తో పంపుతున్నట్లు తెలిపారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో శనివారం అధికారులు దరఖాస్తులను పరిశీలించినట్లు తహసీల్దార్ సుభాష్‌నాయుడు తెలిపారు. మండలంలో వివిధ గ్రామాల నుంచి మొత్తం 302 దరఖాస్తులు రాగా వాటిలో 36 దరఖాస్తులకు పరిష్కారం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆడపిల్లలను తప్పకుండా చదివించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూర్: మహిళా సాధికారత చదువుతోనే సాధ్యమని, ఆడ బిడ్డలను తప్పకుండా చదివించాలని జిల్లా మహిళా, శిశుసంక్షేమశాఖ అధికారి శ్రీవాణి, ఫైనాన్స్ అధికారి సుమ, ఎస్ఐ నరేందర్ అన్నారు. శనివారం స్థానిక విశ్వభారతి ఉన్నత పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలతో అనార్థాలు, లింగవివక్ష, చదువుకోవడం వల్ల ప్రయోజనాలు, ర్యాగింగ్, సమాజంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, సైబర్‌నేరాలు, సెల్‌ఫోన్ వాడకంవల్ల కలిగే నష్టాలు, క్రమశిక్షణ అంశాలపై వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మోట్లంపల్లిలో అవగాహన కల్పిస్తున్న సీఐ శివకుమార్

ఆత్మకూర్: సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్, ఏఎస్ఐ బీచుపల్లి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని మోట్లంపల్లిలో గ్రామస్తులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈమధ్యకాలంలో ప్రేమ, పెళ్లి పేరిట బాలికలను తప్పుదోవ పట్టిస్తున్నారని తల్లదండ్రులు తమ పిల్లలతో బాధ్యాతయుతంగా మెలగాలన్నారు. సైబర్ నేరగాళ్ల నుంచి లాటరీల్లో డబ్బులు వచ్చాయని, బహుమతులు గెలుచుకున్నారని పలురకాల ఫోన్‌కాల్స్ వస్తుంటాయని, వాటితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామస్తులందరూ కలసిమెలసి ఉంటామని ప్రమాణం చేశారు.

మహాసభను జయప్రదం చేయండి

ఆత్మకూర్: సీపీఐఎంఎల్ జాతీయ మహాసభలు 4, 5వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహిస్తున్నామని జిల్లాకార్యదర్శి హన్మంతు, రాజన్న, రాజు, ప్రసాద్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఎన్నో విప్లవపార్టీలు ఏకమై సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్‌గా ఆవిర్భవిస్తున్నట్లు తెలిపారు. 12 రాష్ట్రాల నుంచి 300మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, అలాగే నేపాల్, శ్రీలంక దేశాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కార్మికులు, కర్షకులు, పార్టీ శ్రేణులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



జిల్లా కేంద్రంలోని ఎంపీపీఎస్‌లో..



పాన్‌గల్ ప్రాథమిక పాఠశాలలో..



గొల్లపల్లిలో..

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని కేడీఆర్‌నగర్‌లోని ఎంపీపీఎస్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు బోధించారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని, వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని గొల్లపల్లిలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం నాగరాజు, అధ్యాపకులు బహుమతులు అందించారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ఖిల్లాఘనపురం: మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించినట్లు పరీక్ష కేంద్రం ఇన్‌చార్జ్ రాధ తెలిపారు. మొత్తం విద్యార్థులు 132 మందిని కేటాయించగా, 129 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసినట్లు తెలిపారు.

దేవాలయానికి వెండి కవచం

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకులలో గల వీరాంజనేయస్వామి ఆలయానికి పట్టణ కేంద్రానికి చెందిన సాంబారి నారాయణమ్మ, బాలస్వామి దంపతుల కుమారులు వెండి కవచాన్ని ఆలయ అర్చకులు సధాకర్, జగన్‌మోహన్‌చార్యులకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు.

ధాన్యం అక్రమాలపై విచారణ చేపట్టాలి

పెబ్బేరు రూరల్: జిల్లాలోని రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యం అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని శనివారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కె.విజయరాములు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి వరి ధాన్యం సేకరించి బియ్యంగా మార్చి ఇవ్వాలని పౌరసరఫరాలశాఖ అధికారులు మిల్లులకు తరలించారన్నారు. బియ్యం తిరిగి ఇవ్వాల్సిన గడువు ఎప్పుడో ముగిసినా నేటికీ అందించడం లేదని తెలిపారు. కలెక్టర్ ఫిబ్రవరి 20 వరకు గడువు పొడిగించినా పూర్తిస్థాయిలో అందించలేదని.. కొందరు మిల్లర్లు బియ్యాన్ని బయటి మార్కెట్‌లో విక్రయించడమే కారణమని ఆరోపించారు. మిల్లర్లకు సహకరిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని కోరారు. కలెక్టర్ స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పి.కళావతమ్మ, శ్రీహరి, గోపాలకృష్ణ, రాబర్ట్, రమేష్, కృష్ణయ్య, నరేష్, కుతుబ్, చంద్రశేఖర్, మహేషూ ష్ ,బాలకృష్ణ, కురువ రాముడు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు



కుమారుడితో చీర్లరాణి

పెబ్బేరు రూరల్: వివాహిత అదృశ్యమైన ఘటన శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చీర్ల విజయ్ తన భార్య చీర్ల రాణి కనిపించడం లేదని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. భార్య శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి కొడుకును తీసుకెళ్లి, తిరిగి రాలేదని భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజా వ్యతిరేఖ విధానాలపై ఉద్యమిద్దాం

పెబ్బేరు రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. శనివారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సమావేశం సంఘం జిల్లా కార్యవర్గసభ్యుడు పుట్టా ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఎలక్ట్రోరల్ బాండ్స్ రాజ్యాంగ విరుద్ధమని, చట్ట వ్యతిరేకమని, వాటిని వెంటనే నిలిపివేయాలని, వాటి వివరాలను మార్చి 13లోగా అందించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. తర్వాత కేసు కోర్టులో వేసిన సీపీఎంకి బాండ్లు వచ్చాయని తప్పుడు ప్రచారాన్ని బీజేపీ ప్రారంభించిందని చెప్పారు. కాబట్టి వచ్చే లోకసభ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండి జబ్బార్, బాల్‌రెడ్డి, లక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్ పదవి ఆత్మకూర్ వారికే ఇవ్వాలి



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న నాయకులు

ఆత్మకూర్: మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఆత్మకూర్‌కు చెందిన సీనియర్ నాయకులకే ఇవ్వాలని గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసిరాజ్, పరమేష్, నల్లగొండ శ్రీను డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అతిథి గృహంవద్ద మండల కార్యకర్తల సమావేశంలో పలు తీర్మానాలను చేశారు. ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కొన్నేళ్లుగా అమరచింత, నర్వ మండలాలవారికే ఇస్తున్నారని, ఈసారి కొత్త పాలకవర్గం ఏర్పాటులో ఆత్మకూరుకు సముచిత స్థానిక కల్పించాలన్నారు. ఈ విషయమై మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలసి అభ్యర్థించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆత్మకూర్ రెవెన్యూ డివిజన్, చెరువుకట్ట అభివృద్ధి, వంద పడకల ఆస్పత్రి, మినీ బస్ డిపో తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, రామలక్ష్మారెడ్డి, వినయ్‌రెడ్డి, అజ్మత్, గంగ, దస్తగిరి, గడ్డంశ్రీనివాస్, షంషీర్, సాయిరాఘవ, చిరంజీవి, సూరి, మల్లేష్, అబ్దుల్లా, రఘు, మధు, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యం

పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే నాలుగు అమలు అవుతున్నాయని నాయకులు అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి చల్లావంశీచంద్‌రెడ్డి గెలుపు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. మతోన్మాదంతో జాతివిద్వేషాలను రెచ్చగొడుతూ పాలన కొనసాగిస్తున్న బీజేపీకి రోజులు దగ్గరపడ్డాయన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై కేంద్రం లాఠీలతో కొట్టిస్తున్నారని మండిపడ్డారు.

మైనార్టీ కార్యవర్గం ఏర్పాటు..

పార్టీ మైనార్టీ విభాగం కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా హుస్సేన్‌మియ్య, మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ఎండీ జబ్బార్, యూత్ అధ్యక్షుడిగా ఎండీ రఫీఖ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్వరలోనే అన్ని కార్యవర్గాలను ఎన్నుకోకున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌పార్టీ సీనియర్లను మరవొద్దు

వనపర్తిటౌన్: నియోజకవర్గంలో మేఘారెడ్డి, చిన్నారెడ్డి వర్గాలతో కార్యకర్తలు, నాయకులు లోలోపల నలిగిపోతున్నారని పీసీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే మేఘారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడికి ఏదైన పదవి వస్తే ఆయన వర్గం కూడా తయారైతే కార్యకర్తలు, నాయకుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. చిన్నారెడ్డి బీఆర్ఎస్ నాయకులను, తప్పు చేసిన వ్యక్తులను కాంగ్రెస్‌లోకి తీసుకురావద్దని, వారి ఆగడాలతోనే 10ఏళ్లు చాలా బాధలుపడ్డామని అన్నారు. భవిష్యత్‌లో వచ్చే అన్ని స్థానిక ఎన్నికలకు బీఫాం ఇచ్చే అధికారం ఎమ్మెల్యే మేఘారెడ్డికే ఉంటుందన్నారు. బీఆర్ఎస్ సెకండ్ క్యాడర్‌కు బదులుగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని పార్టీలోకి చేర్చుకోవాలని ఎద్దేవ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ మాట్లాడుతూ.. చిన్నారెడ్డి ఎమ్మెల్యే మేఘారెడ్డికి చెప్పకుండా రాజకీయ దురుద్దేశంతో ఇతర పార్టీల నాయకులను చేర్చుకోవడం సరైంది కాదన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలో పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీని కోసం పనిచేసిన సీనియర్లను మరవద్దని మండల నాయకులు దామోదర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య కోరారు. శనివారం పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు విజయలక్ష్మి, మల్లేష్, నాయకులతో కలిసి మండల కేంద్రంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో అధికార బీఆర్ఎస్ నాయకుల ఒత్తిళ్లకు లొంగకుండా పార్టీ కోసం పనిచేసిన వారు ఎంతో మంది ఉన్నారని చెప్పారు. కరుడుగట్టిన కాంగ్రెస్ పార్టీ నాయకులను కాదని ప్రతిపక్ష నాయకులను పార్టీలో చేర్చుకునేది లేదన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడం జరిగిందన్నారు. చిన్నారెడ్డికి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులుగా పదవి రావడంతో ప్రతిపక్షాలు పండుగ చేసుకోవడం ఏమిటన్నారు. పార్టీలోనే ఉంటూ ప్రతిపక్షాల మాట మాట్లాడే వారి గురించి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామన్నారు.

మోసగాళ్లను పార్టీలో చేర్చుకోవద్దు

కొత్తకోట రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేసిన వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, అదేవిధంగా ఇతర పార్టీల నుంచి వచ్చే మోసగాళ్లను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని పెద్దమందడి ఎంపీపీ రఘుప్రసాద్ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. శనివారం పెద్దమందడి మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ వెంకటస్వామి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి చిన్నారెడ్డికి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులుగా నియమించడంలో పార్టీ గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు. జెండాను మోసిన వారిని కాదని మోసం చేసిన వారిని చేర్చుకోవద్దని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేసిన కొందరు నాయకులు పట్టించుకోవడం లేదన్నారు.

పల్స్‌పోలియో అవగాహన ర్యాలీ



పెద్దమందడిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



పాన్‌గల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై శనివారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాలల్లో పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు సంతోషమ్మ, సుమనశ్రీ, చెన్నమ్మ పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: 5ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలను వేయించాలని పెద్దమందడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సాయిప్రసాద్ అన్నారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే పల్స్ పోలియో కార్యక్రమంపై ఏఎన్‌ఎం, ఆశావర్కర్స్, అంగన్‌వాడీ టీచర్స్, వైద్య సిబ్బంది, విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఓంప్రకాష్, రామస్వామి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కొలువులు సాధించిన అభ్యర్థులు



జయవర్ధన్



అశోక్



శ్రీనివాసులు



చిన్ని సౌమ్య



నవీన్ కుమార్

అమరచింత: తాజాగా వెలువడిన డీఎల్, టీజీటీ, జేఎల్, పీజీటీ ఫలితాల్లో పట్టణానికి ఐదుగురు అభ్యర్థులు కొలువులు సాధించారు. పట్టణానికి చెందిన జయవర్దన్ టీజీటీ ఇంగ్లిష్, అశోక్ టీజీటీ సోషల్, సౌమ్య టీజీటీ మ్యాథ్స్, శ్రీనివాసులు టీజీటీ ఫిజిక్స్‌లలో ఉద్యోగాలు సాధించారు. అదే విధంగా జూనియర్ లెక్చరర్‌గా పట్టణానికి చెందిన నవీన్ కుమార్ గురుకుల టీచర్‌గా విధులు నిర్వహిస్తు, జేఎల్ పరీక్ష రాసి ఉద్యోగం సాధించాడు. పట్టణానికి చెందిన వారు ప్రభుత్వ కొలువులు సాధించడంపై పలువురు నాయకులు, పట్టణవాసులు హర్షం వ్యక్తం చేశారు.